సాక్షి కామారెడ్డి
బుధవారం । 25 । జనవరి । 2023



ఘనంగా మార్కండేయ జయంతి

జిల్లాలో మంగళవారం మార్కండేయ జయంతిని ఘనంగా నిర్వహించారు.
- 9లో ▸



పరీక్ష కేంద్రాలే టార్గెట్

పరీక్ష కేంద్రాలను టార్గెట్ చేసుకుంటున్న దొంగల ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు.
- 8లో ▸

గరిష్ఠం/కనిష్ఠం
33.7 /15.5

వాతావరణం

పొగమంచు కురుస్తుంది. ఈదురు గాలులు వీస్తాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమవుతుంది. చలి తీవ్రత కాస్త తగ్గవచ్చు.

న్యూస్‌రీల్

‘ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తోంది’



కామారెడ్డి టౌన్: రాష్ట్ర ప్రభుత్వం విద్యారంగాన్ని విస్మరిస్తోందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి చింతకాయల ఝాన్సీ పేర్కొన్నారు. విద్యారంగ సమస్యలపై మంగళవారం జిల్లా కేంద్రంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎనిమిదేళ్లుగా విద్యారంగాన్ని పట్టించుకోవడం లేదన్నారు. సంక్షేమ హాస్టళ్లు సమస్యల నిలయాలుగా మారాయన్నారు. మూడేళ్ల నుంచి ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు ఇవ్వకపోవడంతో పేద, మధ్య తరగతి విద్యార్థులు చదువులకు దూరం కావాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మనోజ్, జిల్లా కన్వీనర్ కృష్ణ, పట్టణ అధ్యక్షుడు అనిల్, కార్యదర్శి చరణ్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రోహిత్, అరవింద్, ఖలీల్ తదితరులు పాల్గొన్నారు.

5,558 మందికి కంటి పరీక్షలు

కామారెడ్డి టౌన్: జిల్లాలో 44 చోట్ల కంటి వెలుగు క్యాంపులు కొనసాగుతున్నాయి. మంగళవారం జిల్లాలో 5,558 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 1,570 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఇప్పటి వరకు 21,206 మందికి కంటి పరీక్షలు నిర్వహించామని, ఇందులో 5,094 మందికి కంటి అద్దాలను పంపిణీ చేశామని వైద్యాధికారులు తెలిపారు.

బల్దియాను సందర్శించిన శిక్షణ కలెక్టర్

కామారెడ్డి టౌన్: శిక్షణ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ మంగళవారం కామారెడ్డి మున్సిపల్ కార్యాలయాన్ని సందర్శించారు. ఆయా విభాగాలను తనిఖీ చేశారు. టీపీవో గిరిధర్, టీపీఎస్ రాజేశ్‌లతో మాట్లాడి పట్టణ వివరాలు, అనుమతులు, దరఖాస్తులు, బీపాస్, మాస్టర్ ప్లాన్ తదితర వివరాలను తెలుసుకున్నారు. ప్రజలకు మెరుగైన సేవలను అందించాలని సూచించారు.

కేంద్ర మంత్రిని కలిసిన అరుణతార



మద్నూర్: బీజేపీ జిల్లా అధ్యక్షురాలు అరుణతార మంగళవారం కేంద్ర మంత్రి కిషన్ రెడ్డిని కలిశారు. మహబూబ్‌నగర్‌లో జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశాలలో కేంద్ర మంత్రిని కలిసి జుక్కల్ నియోజకవర్గంలో సమస్యలను వివరించారు. నియోజకవర్గంలో రోడ్లు, పిట్లం మండలంలోని తిమ్మానగర్‌లో బ్రిడ్జి నిర్మించాలని, ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరినట్లు అరుణతార తెలిపారు. మద్నూర్‌లో కేంద్రీయ విద్యాలయాన్ని ప్రారంభించాలని విజ్ఞప్తి చేశానని, జుక్కల్ మండలంలోని కౌలాస్ కోట గురించి వివరించానని పేర్కొన్నారు.

ధ్రువీకరణ పత్రాలు అందించాలి

కామారెడ్డి టౌన్: పదోన్నతుల జాబితాలో ఉన్న ఉపాధ్యాయులు ఒరిజినల్ సర్టిఫికెట్లను జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమర్పించాలని డీఈవో రాజు మంగళవారం ఒక ప్రకటనలో సూచించారు. ప్రధానోపాధ్యాయుల జాబితాలో ఉన్నవారు బుధవారం, స్కూల్ అసిస్టెంట్ పదోన్నతుల జాబితాలో ఉన్నవారు 27న సర్టిఫికెట్లు అందించాలని తెలిపారు.

28న నిజామాబాద్‌కు మంత్రి కేటీఆర్ రాక



నిజామాబాద్‌నాగారం: రాష్ట్ర ఐటీ, మున్సిపల్ శాఖల మంత్రి కేటీఆర్ 28న నిజామాబాద్‌కు రానున్నారు. నగరంలోని పాత కలెక్టరేట్ ప్రాంతంలో ఇందూరు కళాభారతి నిర్మాణానికి భూమిపూజ చేస్తారని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా, కలెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు. వారు మంగళవారం ఏర్పాట్లను పరిశీలించారు.

విద్యుత్ మంటలు..!

విద్యుత్ వినియోగ చార్జీలకు తోడు ఏసీడీ(అడిషనల్ కన్జంప్షన్ డిపాజిట్) ద్యూ పేరుతో అడ్డగోలుగా వసూళ్లు చేస్తుండడాన్ని వినియోగదారులు జీర్ణించుకోలేకపోతున్నారు. ఇప్పటికే విద్యుత్ చార్జీలు విపరీతంగా పెరిగి భారంగా మారిన పరిస్థితుల్లో ఏసీడీ పేరుతో అదనపు దోపిడీకి పాల్పడుతుండడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బిల్లుల వసూళ్ల కోసం గ్రామాలకు వస్తున్న సిబ్బందిని నిలదీస్తూ, నిర్బంధిస్తూ ప్రజలు నిరసన తెలుపుతున్నారు.



చిన్నమల్లారెడ్డిలో విద్యుత్ సిబ్బందిని ప్రశ్నిస్తున్న గ్రామస్తులు

- ఏసీడీ చార్జీలపై పెల్లుబుకుతున్న నిరసనలు
- ట్రాన్స్‌కో సిబ్బందిని నిలదీస్తున్న వినియోగదారులు
- సమాధానం చెప్పలేకపోతున్న ఉద్యోగులు

సాక్షి, కామారెడ్డి: జిల్లాలో గృహ, వ్యాపార, పరిశ్రమలు తదితర కేటగిరీలకు చెందిన విద్యుత్ కనెక్షన్లు 2.94 లక్షల వరకు ఉన్నాయి. ఇందులో అత్యధికంగా గృహ విద్యుత్ వినియోగానికి సంబంధించి కేటగిరి–1లో 2,53,255 కనెక్షన్లు ఉండగా, కేటగిరి –2 లో 31,150 కనెక్షన్లున్నాయి. ఐదో కేటగిరి కిందకు వచ్చే వ్యవసాయ కనెక్షన్లు 1.03 లక్షలు ఉన్నాయి. విద్యుత్ వినియోగానికి సంబంధించి ప్రతినెల రూ.18 కోట్లపైనే బిల్లులు వస్తున్నాయి.

ఏసీడీ ద్యూ పేరుతో దోపిడీ..

విద్యుత్ వినియోగ చార్జీలు అడ్డగోలుగా పెరగడంతో ఇబ్బందిపడుతున్న వినియోగదారులపై విద్యుత్ శాఖ అదనపు భారాన్ని మోపుతోంది. ఇటీవల కస్టమర్ డెవలప్‌మెంట్ చార్జీల పేరుతో వేలాది రూపాయలు ముక్కు పిండి వసూలు చేసిన విద్యుత్ సంస్థ.. ప్రస్తుతం ఏసీడీ ద్యూ పేరుతో అదనపు చార్జీలను వడ్డిస్తోంది. ఏడాది కాలంలో వినియోగించిన విద్యుత్‌కు సంబంధించి సరాసరిన రెండు నెలల వినియోగ చార్జీని అదనపు డిపాజిట్టుగా వసూలు చేస్తున్నట్లు తెలుస్తోంది. జిల్లాలో ఏసీడీ ద్యూ చార్జీ కింద రూ. 8.97 కోట్లు వసూలు చేయాలని ట్రాన్స్‌కో లక్ష్యంగా పెట్టుకున్నట్లు సమాచారం. అదనంగా వాడుకున్న విద్యుత్‌కే డిపాజిట్టు ఉంటుందని చెబుతున్నారు. అయితే ఇప్పటికే పెరిగిన కరెంటు బిల్లులను చెల్లించడానికే ఆపసోపాలు పడుతున్న సామాన్యులు.. అదనంగా డిపాజిట్లు చెల్లించాలంటుండడంతో మరింత ఇబ్బంది పడుతున్నారు. పెరిగిన ధరలతో కుటుంబ పోషణ భారంగా మారిన పరిస్థితుల్లో విద్యుత్ డిపాజిట్లు ఎలా కట్టాలంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

పల్లెల్లో నిరసనలు..

విద్యుత్ చార్జీలకు తోడు డిపాజిట్లు కూడా బిల్లుల్లో వేస్తుండడంతో వినియోగదారులు ఆందోళన చెందుతున్నారు. ముఖ్యంగా పల్లె జనం విద్యుత్ ఏసీడీ చార్జీలపై నిరసనలకు దిగుతున్నారు. తాడ్వాయి మండలం కన్కల్ గ్రామంలో సోమవారం వసూళ్ల కోసం వెళ్లిన ట్రాన్స్‌కో సిబ్బందిని గ్రామస్తులు నిర్బంధించి నిలదీశారు. మంగళవారం కామారెడ్డి మండలం చిన్నమల్లారెడ్డి గ్రామంలో విద్యుత్ సిబ్బందిని నిలదీశారు. రెగ్యులర్‌గా చార్జీలు చెల్లిస్తున్నా, డిపాజిట్లు ఎందుకని ప్రశ్నించారు. అలాగే తాడ్వాయి మండలం బ్రాహ్మణపల్లి గ్రామంలో విద్యుత్ సిబ్బందిని నిర్బంధించారు. అయితే ఏసీడీ ద్యూ అనేది డిపాజిట్ మాత్రమేనని విద్యుత్ సిబ్బంది ప్రజలకు వివరించే ప్రయత్నం చేస్తున్నారు. అయినప్పటికీ నిరసనలు నిలదీతలు, నిరసనలు తప్పడం లేదు. కొన్నిచోట్ల నిర్బంధించి నిరసనలు తెలుపుతున్నారు. దీంతో ట్రాన్స్‌కో సిబ్బంది ఇబ్బంది పడాల్సి వస్తోంది.

విద్యుత్ అధికారుల నిర్బంధం



బ్రాహ్మణపల్లిలో విద్యుత్ అధికారులను నిర్బంధించిన గ్రామస్తులు

తాడ్వాయి: బ్రాహ్మణపల్లి గ్రామంలో మంగళవారం విద్యుత్ అధికారులను గ్రామస్తులు నిర్బంధించారు. వివరాలిలా ఉన్నాయి. లైన్‌మన్ వెంకట్, అడిషనల్ లైన్‌మన్ శంకర్, జూనియర్ లైన్‌మన్ వెంకట్ కరెంటు బిల్లుల వసూలు కోసం మంగళవారం గ్రామానికి వచ్చారు. ఏసీడీ చార్జీలపై ప్రజలు వారిని ప్రశ్నించారు. ప్రతినెల బిల్లులు సక్రమంగా చెల్లిస్తున్నప్పటికీ బిల్లులు అధికంగా ఎందుకు వస్తున్నాయని నిలదీశారు. బిల్లుల వసూళ్ల కోసం వచ్చిన విద్యుత్ అధికారులను పాత గ్రామపంచాయతీ భవనంలో నిర్బంధించారు. గంట తర్వాత వారిని వదిలిపెట్టారు.

చిన్నమల్లారెడ్డిలో..

కామారెడ్డి రూరల్: ఏసీడీ ద్యూ చార్జీలపై చిన్నమల్లారెడ్డి గ్రామస్తులు లైన్ ఇన్‌స్పెక్టర్ నగేష్‌తో పాటు బిల్ కలెక్టర్‌ను నిలదీశారు. ఏసీడీ చార్జీల పేరిట వేలాది రూపాయలు బిల్లులు వసూలు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వందల్లో కరెంటు బిల్లు వస్తుండగా వేలాది రూపాయల ఏసీడీ చార్జీ వేయడాన్ని ప్రశ్నించారు. విద్యుత్ అధికారులు సర్దిచెప్పడానికి ప్రయత్నించినా ప్రజలు వినిపించుకోలేదు. ఏసీడీ మినహాయించకపోతే విద్యుత్ బిల్లులు చెల్లించబోమని స్పష్టం చేశారు.

అదనపు వినియోగానికే డిపాజిట్టు..

విద్యుత్‌ను అదనంగా వినియోగించుకున్న వారికి ఏడాదిలో సరాసరిన రెండు నెలల బిల్లును అదనపు డిపాజిట్‌గా తీసుకుంటున్నాం. అదనంగా వాడుకున్న వారికే బిల్లుల్లో అదనపు డిపాజిట్ వస్తుంది. ఇది విద్యుత్ చార్జీ కాదు. డిపాజిట్ మాత్రమే అన్న విషయాన్ని వినియోగదారులు అర్థం చేసుకోవాలి.
–రమేశ్‌బాబు, ఎస్‌ఈ, ట్రాన్స్‌కో

మాస్టర్ ప్లాన్‌పై నేడు హైకోర్టులో విచారణ

కామారెడ్డి టౌన్: కామారెడ్డి మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేయాలని కోరుతూ రామేశ్వరపల్లికి చెందిన రైతులు హైకోర్టులో వేసిన కేసుపై బుధవారం మరోసారి వాదనలు జరగనున్నాయి. తమను సంప్రదించకుండానే తమ భూములను రిక్రియేషన్ జోన్‌గా ప్రకటించారని రామేశ్వరపల్లికి చెందిన రైతులు రిట్ పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈనెల 11న విచారణ జరిపిన న్యాయస్థానం .. కేసును 25వ తేదీకి వాయిదా వేసింది.

ఈనెల 20వ తేదీన అత్యవసరంగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించి మాస్టర్ ప్లాన్‌ను రద్దు చేస్తూ తీర్మానం చేసిన విషయం తెలిసింది. ఆ తీర్మానాన్ని ప్రభుత్వానికి పంపించారు. అయితే మాస్టర్ ప్లాన్ రద్దుపై ఇంకా అధికారికంగా ఎలాంటి ప్రకటన రాలేదు. ఈ నేపథ్యంలో బుధవారం హైకోర్టులో మరోసారి విచారణ జరగనుంది. రైతుల పక్షాన న్యాయవాది సృజన్‌రెడ్డి వాదనలు వినిపించనున్నారు. ప్రభుత్వం తరఫున అడ్వకేట్ జనరల్, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు వివరణ ఇవ్వనున్నారు. కౌన్సిల్ తీర్మానం కాపీలను కోర్టుకు సమర్పించనున్నారు. కేసు విచారణపై రైతుల్లో ఆసక్తి నెలకొంది.

‘ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలి’



దోమకొండ: ఆడపిల్లలు ధైర్యంగా ఉండాలని, ప్రతి ఒక్కరు క్రమశిక్షణతో కూడిన జీవితాన్ని అలవాటు చేసుకోవాలని జిల్లా జడ్జి శ్రీదేవి సూచించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా న్యాయసేవాధికార సంస్థల ఆధ్వర్యంలో మంగళవారం మండల కేంద్రంలోని గడికోటలో జాతీయ బాలికల దినోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా జిల్లాలో వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు బహుమతులు అందించారు. సీనియర్ సివిల్ జడ్జి కిరణ్‌కుమార్, అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, సీడబ్ల్యూసీ చైర్మన్ స్వర్ణలత, మెంబర్ స్రవంతి, జిల్లా బాలల పరిరక్షణ అధికారి స్రవంతి పాల్గొన్నారు.

‘వ్యవసాయాన్ని పండుగలా మార్చారు’



మాట్లాడుతున్న స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి

ఎల్లారెడ్డి: వ్యవసాయం పండుగని నిరూపించిన వ్యక్తి సీఎం కేసీఆర్ అని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎల్లారెడ్డిలోని ముత్యపు రాఘవులు ఫంక్షన్ హాల్‌లో ఎల్లారెడ్డి మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమం నిర్వహించారు. స్పీకర్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఖరీఫ్‌లో రాష్ట్రంలో అత్యధికంగా వరి కొనుగోలు చేసిన జిల్లాలలో నిజామాబాద్ మొదటి స్థానంలో, కామారెడ్డి రెండో స్థానంలో నిలిచాయన్నారు. రైతులు ఆర్థికంగా ఎదుగుతున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకుని కేంద్రం రైతులపై ఆదాయపు పన్ను విధించాలని కొందరు సలహా ఇస్తున్నారన్నారు. రైతులు పెట్టుబడి తగ్గించి, దిగుబడులు పెంచే దిశగా అడుగులు వేయాలని సూచించారు. రూ. 3 కోట్ల మున్సిపల్ నిధులతో ఎల్లారెడ్డిలో నూతన బస్టాండ్ నిర్మాణం చేపట్టామని ఎమ్మెల్యే సురేందర్ తెలిపారు. త్వరలోనే వంద పడకల ఆస్పత్రితో పాటు, సమీకృత మార్కెట్ భవన నిర్మాణానికి భూమి పూజ చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎల్లారెడ్డి, నాగిరెడ్డిపేట జెడ్పీటీసీలు ఉషాగౌడ్, మనోహర్‌రెడ్డి, ఎంపీపీ మాధవి, సదాశివనగర్, గాంధారి ఏఎంసీ చైర్మెన్లు సాయిరెడ్డి, సత్యంరావు, డీసీసీబీ డైరెక్టర్లు కపిల్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, మాజీ మంత్రి నేరెళ్ల ఆంజనేయులు, నాయకులు నర్సింలు, సాయిలు, ప్రతాప్ రెడ్డి, తానాజీరావు, జలంధర్‌రెడ్డి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఏఎంసీ పాలకవర్గం ప్రమాణ స్వీకారం..

పాలక వర్గంతో జిల్లా మార్కెటింగ్ అధికారి రమ్య ప్రమాణ స్వీకారం చేయించారు. చైర్మన్‌గా కాశి నారాయణ, వైస్ చైర్మన్‌గా ఒంటరి సిద్దిరాంరెడ్డి, డైరెక్టర్లుగా మున్సిపల్ చైర్మన్ కుడుముల సత్యనారాయణ, ఎల్లారెడ్డి సొసైటీ చైర్మన్ నర్సింలు, మల్లారెడ్డి, దివిటి కిష్టయ్య, విఠల్, కలాలి స్వరూప, కంసాని హన్మంత్‌రెడ్డి, వాహబ్, ఫతియొద్దీన్, రాజశేఖర్‌రెడ్డి, శ్రీనివాస్, దేశ్యానాయక్, ముత్యపు సుదర్శన్, ముప్పిడి హరినారాయణ ప్రమాణ స్వీకారం చేశారు.

ఎత్తిపోతల పథకానికి సహకరించాలి

- ఎకరానికి రూ. 13 లక్షల పరిహారం ఇస్తాం
- 'నాగమడుగు' నిర్వాసితులతో కలెక్టర్ పాటిల్
- రూ. 19 లక్షలు ఇవ్వాలంటున్న రైతులు



మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి పాటిల్

నిజాంసాగర్: జుక్కల్ నియోజకవర్గంలో 40 వేల ఎకరాలకు సాగు నీరందించేందుకు చేపట్టిన నాగమడుగు ఎత్తిపోతల పథకానికి రైతులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ జితేష్ వి పాటిల్ కోరారు. మంగళవారం అచ్చంపేట గెస్ట్ హౌస్‌లో నాగమడుగు ఎత్తిపోతల పథకం భూనిర్వాసిత ఒడ్డేపల్లి, జక్కాపూర్ గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులతో కలెక్టర్ సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎత్తిపోతల పథకం లిఫ్టులు, రోడ్లు, పైపులైన్ల నిర్మాణానికి భూములు కోల్పోతున్న రైతులకు 2013 భూసేకరణ చట్టం ప్రకారం పరిహారం చెల్లిస్తామన్నారు. ఎత్తిపోతల పథకం కోసం ఒడ్డేపల్లి శివారులో 10.29 ఎకరాలు, జక్కాపూర్ శివారులో 37 గుంటల భూమి అవసరం అన్నారు. బాధితులకు ఎకరానికి రూ. 13 లక్షల చొప్పున పరిహారం అందించనున్నట్లు తెలిపారు. అయితే ఎకరానికి రూ. 19 లక్షల చొప్పున పరిహారం ఇవ్వాలని రైతులు కోరుతున్నారు. ఇది సాధ్యం కాదని కలెక్టర్ పేర్కొన్నారు. పరిహారం పెంపు విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లాలని ఎల్లారెడ్డి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి వడ్డేపల్లి సుభాష్‌రెడ్డి కలెక్టర్‌ను కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రమోహన్, నీటిపారుదల శాఖ సీఈ శ్రీనివాస్, ఎస్‌ఈ వాసంతి, ఈఈ సోలోమాన్, బాన్సువాడ ఆర్డీవో రాజాగౌడ్, డిప్యూటీ ఈఈ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ నారాయణ, ఏఈ శివప్రసాద్, నాయకులు విఠల్, మనోహర్, రమేష్‌గౌడ్ పాల్గొన్నారు.

కంటి పరీక్షల సంఖ్య పెంచాలి

నిజాంసాగర్: కంటి వెలుగు శిబిరాల్లో కంటి పరీక్షల సంఖ్యను పెంచాలని కలెక్టర్ పాటిల్ వైద్యశాఖ ఆదేశించారు. మంగళవారం అచ్చంపేటలో కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలించారు. కంటి వెలుగుపై ప్రజలకు అవగాహన కల్పించి, అందరూ పరీక్షలు చేసుకునేలా చూడాలన్నారు. అవసరమున్న వారికి మందులు, అద్దాలను పంపిణీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ అనుసూయ, పంచాయతీ కార్యదర్శి గంగారాం, వైద్య సిబ్బంది సాయిలు, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

రైతులతో కలిసి భోజనం..



అచ్చంపేట గెస్ట్‌హౌస్ వద్ద సమావేశం అనంతరం కలెక్టర్ రైతులతో కలిసి భోజనం చేశారు. కలెక్టర్ కోసం నీటిపారుదలశాఖ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేసినప్పటికీ ఆయన భూనిర్వాసితులతో కలిసి భోజనం చేయడానికే ఆసక్తి చూపారు.

పొగాకు రహిత జిల్లాగా మార్చాలి



వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే, అడిషనల్ ఎస్పీ అన్యోన్య

- అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

కామారెడ్డి క్రైం: కామారెడ్డిని పొగాకు రహిత జిల్లాగా మార్చాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే సూచించారు. కలెక్టరేట్‌లో మంగళవారం పొగాకు నియంత్రణ జిల్లా స్థాయి సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొగాకు వల్ల అనర్థాలను వివరించారు. పొగాకుకు దూరంగా ఉండేలా ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని సూచించారు. ప్రభుత్వ కార్యాలయాలు, ప్రజలు గుమిగూడే ప్రాంతాలైన బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, సినిమా హాళ్లలో పొగ తాగితే టోల్ ఫ్రీ నెంబర్ 1800 112 356 కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని ప్రజలను కోరారు. డాక్టర్ శ్రవణ్ కుమార్, డాక్టర్ రమిత జాతీయ పొగాకు నియంత్రణ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. ప్రతి మూడు నెలలకు ఒకసారి పొగాకు నియంత్రణపై అవగాహన సమావేశాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ అన్యోన్య, డీఎంహెచ్‌వో లక్ష్మణ్ సింగ్, ప్రోగ్రాం అధికారి శిరీష, జిల్లా కార్మిక శాఖ అధికారి సురేందర్, ఇంటర్ బోర్డు నోడల్ అధికారి షేక్ సలాం, ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ కిష్టయ్య, జిల్లా రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ రాజన్న, వైద్యశాఖ అధికారులు వేణుగోపాల్, సుధాకర్, ఎంపీడీవోలు, మున్సిపల్, పోలీస్, వైద్యశాఖల అధికారులు పాల్గొన్నారు.

‘తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి’



మాట్లాడుతున్న ఎమ్మెల్యే జాజాల సురేందర్

ఎల్లారెడ్డిరూరల్: తల్లితండ్రులు కన్న కలలను యువత సాకారం చేయాలని ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్ సూచించారు. మంగళవారం ఎల్లారెడ్డి మోడల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రిలయన్స్ ఫౌండేషన్, జిల్లా ఉపాధి కల్పన కార్యాలయం ఆధ్వర్యంలో జాబ్ మేళా నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉద్యోగాలను కల్పించేందుకు కంపెనీలు మన దగ్గరికే వస్తున్నాయన్నారు. ఎంఎన్‌సీలలో ఉద్యోగాల ద్వారా విదేశాలకు వెళ్లే అవకాశమూ రావొచ్చన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సత్యనారాయణ, జెడ్పీటీసీ ఉషాగౌడ్, కళాశాల ప్రిన్సిపల్ ప్రవీణ్‌కుమార్, అధ్యాపకులు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు రాజు, శ్వేత, శ్రీనివాస్, నరేందర్ పాల్గొన్నారు.

పత్తి క్వింటాలుకు రూ. 8,150



మద్నూర్: మండల కేంద్రంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో మంగళవారం పత్తి క్వింటాలుకు కనిష్ఠ ధర రూ. 7,950, గరిష్ఠంగా రూ. 8,150 పలికింది. జుక్కల్ నియోజకవర్గంతో పాటు సమీపంలోని మహారాష్ట్ర నుంచి రైతులు పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయించారు.

క్లుప్తంగా

ఔట్ సోర్సింగ్ ఉద్యోగి తొలగింపు

- నిజామాబాద్ రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో..

సాక్షి ఎఫెక్ట్..

సుభాష్‌నగర్ : నిజామాబాద్ రూరల్ రిజిస్ట్రేషన్ కార్యాలయంలో రిజిస్టర్డ్ డాక్యుమెంట్ స్కాన్ చేయాలంటే డబ్బులు వసూలు చేస్తున్న వైనంపై 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి రిజిస్ట్రేషన్ అధికారులు స్పందించారు. సదరు ఔట్ సోర్సింగ్ ఉద్యోగిని తొలగించారు. వసూళ్ల కథనంపై రిజిస్ట్రేషన్ కార్యాలయ వర్గాల్లో చర్చనీయాంశమైంది. ఒక్కో రిజిస్టర్డ్ డాక్యుమెంట్ స్కాన్ చేయడానికి ఓ ఔట్ సోర్సింగ్ ఉద్యోగి రూ.500 వరకు వసూలు చేస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తాయి. ఇదంతా ఉన్నతాధికారుల కనుసన్నల్లోనే వ్యవహారం జరుగుతున్నట్లు ఆరోపణలు రావడంతో తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనని సదరు ఉద్యోగిని విధుల నుంచి తొలగించారు.

డిగ్రీ పరీక్షల్లో 77 మంది గైర్హాజరు

తెయూ(డిచ్‌పల్లి) : తెలంగాణ యూనివర్సిటీ పరిధిలో మంగళవారం జరిగిన డిగ్రీ 6వ సెమిస్టర్ బ్యాక్‌లాగ్ పరీక్షల్లో 736 మంది విద్యార్థులకు గాను 659 మంది హాజరు కాగా 77 మంది గైర్హాజరైనట్లు కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం.అరుణ తెలిపారు.

క్రషింగ్ లక్ష్యాన్ని అధిగమిస్తాం


వేణుగోపాల్ రావు ఎండీ, గాయత్రి షుగర్స్

సదాశివనగర్: చెరుకు క్రషింగ్‌కు సంబంధించి ఈ సీజన్‌లో నిర్ణయించిన 4.10 లక్షల టన్నుల లక్ష్యాన్ని అధిగమిస్తామని మండలంలోని అడ్లూర్‌ఎల్లారెడ్డి గాయత్రి షుగర్స్ ఫ్యాక్టరీ వైస్ ప్రెసిడెంట్ వేణుగోపాల్ రావు పేర్కొన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ అగ్రిమెంట్ చేసుకున్న రైతుల చెరుకునే ప్రస్తుతం క్రషింగ్‌కు తరలిస్తున్నట్లు వెల్లడించారు. ఇప్పటికి 2.52 లక్షల టన్నుల క్రషింగ్ పూర్తి చేశామన్నారు. రైతులకు 40 శాతం మేరకు బిల్లులు చెల్లించినట్లు తెలిపారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని పర్మిట్ల ప్రకారం చెరుకును ఫ్యాక్టరీకి తరలిస్తామన్నారు. కార్యక్రమంలో ఫైనాన్స్ మేనేజర్ మాలకొండయ్య, పర్సనల్ మేనేజర్ వేంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలి

బిచ్కుంద: ఎరువులు, విత్తనాల క్రయ, విక్రయాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి డీలర్లకు సూచించారు. మంగళవారం బిచ్కుందలో జుక్కల్ నియోజకవర్గ ఎరువులు, విత్తనాల డీలర్లు, దుకాణదారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగామె మాట్లాడుతూ అనుమతి పొందిన విత్తనాలు, పురుగు మందులనే విక్రయించడంతో పాటు కొనుగోలుదారులకు బిల్లులు ఇవ్వాలని ఆదేశించారు. ఎంఆర్‌పీ కంటే ఎక్కువ ధరకు విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏడీఏ నూతన్ కుమార్, ఏవోలు రాజు, నవీన్‌కుమార్, నయిమొద్దీన్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

వరి పంటకు తెగుళ్ల బెడద

- తప్పనిస్థితిలో భారీగా రసాయన మందుల పిచికారి
- ఆందోళన చెందుతున్న రైతులు


అన్నాసాగర్ శివారులో తెగుళ్లబారిన పడిన వరి

నిజాంసాగర్(జుక్కల్): యాసంగి సీజన్‌లో ముందస్తుగా సాగు చేసిన వరి పంటకు తెగుళ్ల బెడద పట్టుకుంది. వాతావరణ పరిస్థితులు అనుకూలించకపోవడం, రాత్రివేళ ఉష్ణోగ్రతలు పడిపోవడంతో వరిపై తీవ్ర ప్రభావం చూపాయి. వరినాట్లు వేసి ముప్పై రోజులు గడుస్తున్న వరిపైర్లు మొగి పురుగు, ఉల్లికోడు తెగుళ్లతో పాటు జింకుదాతు లోపం కారణంగా పంటలు ఎదగకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

కామారెడ్డి జిల్లాలో..

జిల్లాలో 2.5 లక్షల ఎకరాల్లో వరి పంటల సాగు లక్ష్యంగా కాగా ఇప్పటివరకు 2.28 లక్షల ఎకరాల్లో వరినాట్లు వేశారు. బాన్సువాడ, బీర్కూర్, నస్రుల్లాబాద్, బిచ్కుంద, పిట్లం, నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట, గాంధారి తదితర మండలాల్లో ముందస్తుగా వరినాట్లు వేశారు. వ్యవసాయ బోరుబావులు, లిఫ్ట్‌ల వద్ద నవంబర్ నెలాఖరు నుంచి వరి నాట్లను ప్రారంభించారు. ముందస్తుగా సాగు చేసిన వరి పంటలపై వాతావరణ పరిస్థితులు అనుకూలించలేదు. దాంతో తెగుళ్లు పట్టగా తప్పని స్థితిలో మోతాదుకు మించి రసాయన మందులు పిచికారీ చేస్తున్నారు. చలి ప్రభావంతో పాటు వాతావరణంలో మార్పులు మబ్బుల కారణంగా పంటలను తెగుళ్లు ఆశించాయి.

నివారణ చర్యలు

కాండం తొలుచు పురుగు(మొగిపురుగు): వరినాటు వేసి ముప్పై రోజుల లోపు ఉన్న పంటలపై కార్బోఫ్యూరాన్ 3 జీ గుళికలు ఎకరానికి 10 కిలోల చొప్పున చల్లాలి. కార్టాప్ హైడ్రో క్లోరైడ్ 4 జీ గుళికలు ఎకరానికి 8 కిలోల చొప్పున వాడాలి. క్లోరోపైరిఫాస్ 10 జీ గుళికలను ఎకరానికి 4 కిలోలు లేక కొరాంట్రినిలిప్రోల్ 0.4 జీ గుళికలను ఎకరానికి 4 కిలోలు చల్లాలి.

నాటిన ముప్పై రోజుల తర్వాత మందు పిచికారి: క్లోరో పైరిఫాస్ 50 ఈసీ మందును ఎకరానికి 250 ఎమ్ఎల్ లేదా కార్టోప్ హైడ్రోక్లోరైడ్ 400 గ్రాము మందును ఎకరాని పిచికారి చేయాలి.

ఉల్లికోడు (గొట్టం తెగులు): ఫిప్రొనిల్ గుళికలు ఎకరానికి 4 కిలోలు చొప్పున చల్లాలి. ఫ్రిప్రానిల్ 400 ఎమ్ఎల్ పిచికారి చేయాలి. లేదా కార్బోసల్ఫాన్ 200 ఎమ్ఎల్‌ను ఎకరానికి పిచికారి చేయాలి.

జింకు లోపం: ముడి జింకు ఎకరానికి 20 కిలోల చొప్పున చల్లాలి. లేదా జింకు సల్ఫేట్ 400 గ్రాములను ఎకరానికి పిచికారి చేయాలి.

వాతావరణమే కారణం..

వరి పంటల సాగుకు వాతావరణ పరిస్థితులు అనూకూలించకపోవడంతో పంటలు తెగుళ్లబారిన పడుతున్నా యి. రాత్రివేళ ఉష్ణోగ్రతలు తగ్గడం మూలంగా వరిపైర్ల ను తెగుళ్లు ఆశిస్తున్నాయి. వ్యవసాయ అధికారులు సలహాలు, సూచనల మేరకు మందులను పిచికారి చేయాలి.

– అమర్‌ప్రసాద్ ఏవో, నిజాంసాగర్

ఒక్కటైన అమెరికా అమ్మాయి.. గోవింద్‌పేట్ అబ్బాయి


మూగ ఆకాశ్, లేసి అలెక్సస్ ఓల్సన్ వివాహానికి హాజరైన కుటుంబ సభ్యులు

పెర్కిట్(ఆర్మూర్) : ఖండాంతరాలు దాటిన వారి ప్రేమ వివాహ బంధంతో ఒక్కటైంది. ఆర్మూర్ మండలం గోవింద్‌పేట్ గ్రామానికి చెందిన మూగ దేవారం, శుభమణి దంపతుల కుమారుడు మూగ ఆకాష్ ఓ క్రైస్తవ స్వచ్ఛంద సంస్థలో పనిచేస్తున్నాడు. అదే సంస్థలో అమెరికాకు చెందిన లేసి అలెక్సస్ ఓల్సన్ నర్సింగ్ సేవలు అందిస్తున్నారు. ఇరువురు ప్రేమించుకోగా ఇరు కుటుంబాలు ఒప్పుకున్నారు. ఆర్మూర్‌లోని కొటార్మూర్ తిరుమల గార్డెన్‌లో క్రైస్తవ పద్ధతిలో మంగళవారం పెళ్లి చేశారు. వివాహానికి లేసి అలెక్సస్ ఓల్సన్ తల్లితండ్రులు ట్రాయ్ అలన్ ఓల్సన్, జిమ్మీ డెనిస్ బౌమెన్ హాజరయ్యారు.

ప్రతి విద్యార్థికి లక్ష్యం ఉండాలి


భవనాన్ని పరిశీలిస్తున్న కామారెడ్డి కలెక్టర్ పాటిల్

పెద్దకొడప్‌గల్(జుక్కల్): ప్రతి విద్యార్థికి ఒక లక్ష్యం ఉండాలని ఆ లక్ష్యసాధనకు కృషి చేయాలని కామారెడ్డి కలెక్టర్ జితేష్ వి పాటిల్ పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నూతనంగా నిర్మిస్తున్న పాఠశాల భవనాన్ని కలెక్టర్ జితేష్ వి పాటిల్ పరిశీలించారు. విశాలమైన ప్రాంగణంలో ఉన్న పాఠశాలను చూసి అభినందించారు. అనంతరం షటిల్ కోర్టులో స్థానిక ప్రజాప్రతినిధులతో కలసి షటిల్ ఆడారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ రాజా గౌడ్, తహసీల్దార్ దశరత్, ఎంపీపీ ప్రతాప్ రెడ్డి, ఎంపీడీవో రాణి, ఎంపీవో సూర్యకాంత్, సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, సర్పంచ్ తిర్మల్ రెడ్డి పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ప్రణాళికతో విద్యాభ్యాసం చేయాలి


విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

సిరికొండ : ప్రణాళికతో విద్యాభ్యాసం చేస్తే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని కలెక్టర్ నారాయణ రెడ్డి విద్యార్థులకు సూచించారు. జాతీయ జాంబోరిలో ప్రతిభ కనబర్చిన సిరికొండ సత్యశోధక్ పాఠశాలకు చెందిన స్కౌట్స్ గైడ్స్ విద్యార్థులను కలెక్టర్ తన కార్యాలయంలో మంగళవారం అభినందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్కౌట్స్ గైడ్స్‌తో క్రమశిక్షణతో పాటు జాతీయ భావం పెంపొందుతుందన్నారు. జాంబోరిలో పాల్గొని ప్రతిభ కనబర్చిన సంజన, వైష్ణవి, సింధు, రచన, యశ్వంత్, సలాం, నవీన్‌కు కలెక్టర్ జ్ఞాపికలు అందచేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఈఓ రడీవో చందర్, ప్రిన్సిపాల్ నర్సయ్య, జిల్లా సైన్స్ సమన్వయ అధికారి గంగాకిషన్, గైడ్ కెప్టెన్ వనిత పాల్గొన్నారు.

భూమి కోసం..

- సెల్‌టవర్ ఎక్కిన బాధితుడు
- అక్రమంగా ఆక్సిజన్ పార్కు ఏర్పాటు చేశారని ఆరోపణ
- ఆ భూమి గర్గుల్ జీపీదేనంటున్న సర్పంచ్
- పోలీసుల హామీతో కిందకు దిగిన బాధితుడు


సెల్‌టవర్ ఎక్కిన బాధితుడు బాలరాజుగౌడ్

కామారెడ్డి అర్బన్ : తన ఎకరం భూమిలో ఆక్సిజన్ పార్కు ఏర్పాటు చేశారని నిరసిస్తూ కామారెడ్డి మండలం గర్గుల్ గ్రామానికి చెందిన లారీ డ్రైవర్ బాల్‌రాజుగౌడ్ మంగళవారం సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్య ప్రయత్నం చేశారు. కామారెడ్డి సమీపంలోని గెలాక్సి ఫంక్షన్‌హాల్ వద్ద సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్య యత్నం చేసిన బాల్‌రాజుగౌడ్ చివరికి పోలీసులు ఇచ్చిన హామీతో కిందకు దిగారు. వివరాలు ఇలా ఉన్నాయి. గర్గుల్ శివారులోని 310/4 సర్వేనంబర్‌లో బాలరాజుగౌడ్‌కు ఎకరం భూమి ఉండగా దానికి సంబంధించి రైతు పాసు పుస్తకంతో పాటు రైతుబంధు, పీఎం కిసాన్ యోజన ప్రయోజనం అందుతుండగా దానిలో గ్రామ ఆక్సిజన్ పార్క్‌ను ఏర్పాటు చేశారు. అధికారులకు ఫిర్యాదు చేస్తే హద్దులు పాతించి ఇచ్చారని, వాటిని సర్పంచ్ రవితేజగౌడ్ తొలగించి అప్పటి ఎస్సై శ్రీకాంత్‌తో బెదిరించినట్లు బాలరాజుగౌడ్ ఆరోపించారు. గత్యంతరం లేక తనగోడును వెళ్లబోసుకోవడానికి సెల్‌టవర్ ఎక్కినట్లు బాధితుడు బాలరా జు గౌడ్ వివరించారు. మూడున్నర గంటల అనంతరం సెల్‌టవర్ దిగడంతో పోలీసులు, ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. అయితే బాలరాజుగౌడ్ తనపై చేస్తున్న ఆరోపణల్లో నిజం లేదని గర్గుల్ సర్పంచ్ రవితేజగౌడ్ అన్నారు. ఆక్సిజన్ పార్కు ఏర్పాటు చేసిన భూమి గర్గుల్ జీపీదేనన్నారు. మంగళవారం ఆయన సమవేశంలో మాట్లాడారు. బాలరాజుగౌడ్ తన వద్ద ఉన్న పాస్ పుస్తకం ప్రకారం కలెక్టర్ కార్యాలయం చుట్టూ తిరిగినప్పటికీ భూమి దక్కలేదన్నారు. దీంతో భూమి సర్వే చేసి తనకు ఇప్పించాలని నా వెంట పడ్డాడని, ఇది పద్ధతి కాదని చెప్పినందుకు సెల్‌టవర్ ఎక్కి తనపైనే బెదిరింపులకు దిగినట్టు ఆరోపించారు.

స్వీయ రక్షణ కోసం కరాటే శిక్షణ

- విద్యార్థినులకు కలెక్టర్ నారాయణరెడ్డి ఉద్బోధ
- బోర్గాం(పి) జెడ్పీహెచ్‌ఎస్‌లో స్వీయ ఆత్మరక్షణ తరగతులు ప్రారంభం


నగరంలోని బోర్గాం(పి) జెడ్పీ హెచ్‌ఎస్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణ రెడ్డి

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జీవితంలో సమస్యలు వచ్చినప్పుడు కుంగిపోకుండా వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఉద్బోధించారు. ఆత్మస్థైర్యంతో ముందుకు సాగితే, జీవితంలో ఎదురయ్యే ఎలాంటి సమస్యనైనా అధిగమించవచ్చన్నారు. జాతీయ బాలికల దినోత్సవాన్ని పురస్కరించుకుని నగర శివారులోని బోర్గాం (పి) జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు స్వీయ ఆత్మరక్షణ కోసం ఏర్పాటుచేసిన కరాటే శిక్షణ తరగతులను కలెక్టర్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు, యువతులకు స్వీయ ఆత్మరక్షణ అవసరం అని గుర్తించిన ప్రభుత్వం, ఆయా పాఠశాలల్లో సెల్ఫ్ డిఫెన్స్ శిక్షణ తరగతులను ఏర్పాటు చేసిందని, నెల రోజులపాటు శిక్షణ అందిస్తారని తెలిపారు. పదోతరగతి వార్షి క పరీక్షలకు చక్కగా సన్నద్ధమై ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. స్వీయ ఆత్మరక్షణ కోసం అందిస్తున్న శిక్షణ సద్వినియోగం చేసుకుని ఆత్మస్థైర్యం పెంపొందించుకోవాలన్నారు. శిక్షణ తరగతులకు హాజరయ్యే బాలికలకు అవసరమైన యూనిఫాం, 8, 9వ తరగతుల విద్యార్థినులకు షూస్, సాక్స్ సమకూరుస్తామని కలెక్టర్ పేర్కొన్నారు. నాణ్యమైన విద్యా బోధనతో ప్రత్యేకతను చాటుకుంటున్న బోర్గం(పి) హైస్కూల్ అంటే తనకెంతో అభిమానమని, పాఠశాలలో సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. విద్యార్థినులు ఆలపించిన గేయాలు, ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలు సూదం లక్ష్మి, డీఈఓ దుర్గాప్రసాద్, జీసీడీవో వనిత, పాఠశాల హెచ్‌ఎం శ్రీకాంత్, ఎస్‌ఎంసీ ప్రతినిధులు మల్లెపూల నవీన్, బైస సంగీత, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.


న్యూ అంబేద్కర్ భవన్‌లో చిన్నారిని సన్మానిస్తున్న జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు

ఆడపిల్లలే దేశానికి దిక్సూచి..

నిజామాబాద్ నాగారం : ప్రతి కుటుంబంలో బాలికలను ఉన్నత చదువులు చదివించి ఉన్నత స్థానంలో నిలబెట్టాలని జెడ్పీ చైర్మన్ విఠల్‌రావు తెలిపారు. మంగళవారం న్యూ అంబేద్కర్ భవనంలో జాతీయ బాలికల దినోత్సవ వేడుకల్లో భాగంగా జిల్లా మహిళ, శిశు, సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా పరిషత్ చైర్మన్ హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి మాట్లాడారు. చిన్నారుల నృత్య ప్రదర్శన అలరించింది. వివిధ పోటీల్లో విజేతలైన బాలికలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో మహిళ కమిషన్ సభ్యులు సూదంలక్ష్మి, ఐసీడీఎస్ పీడీ సుధారాణి, సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, అరవింద్, లేబర్ ఆఫీసర్ యోహన్, శ్రీలత, సూపరింటెండెంట్లు ఇందిర, విజయలక్ష్మి, చైతన్య, సౌమ్య, తదితరులు పాల్గొన్నారు.

సెల్ఫ్ డిఫెన్స్‌లో..


సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ ఇస్తున్న శిక్షకులు

రామారెడ్డి(ఎల్లారెడ్డి) : బాలికల ఆత్మరక్షణ కోసమే పాఠశాలలో విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణను ఇస్తున్నట్లు జిల్లా విద్యాధికారి రాజు పేర్కొన్నారు. మంగళవారం రామారెడ్డి మండలంలోని పోసానిపేట ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సెల్ఫ్ డిఫెన్స్‌లో శిక్షణ కార్యక్రమాన్ని డీఈవో రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఈవో రాజు మాట్లాడుతూ బాలికలకు నేటి సమాజంలో సెల్ఫ్ డిఫెన్స్ అత్యంత ముఖ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో ఉమా రాణి, హెచ్‌ఎం కల్యాణి, సర్పంచ్ మహేందర్ రెడ్డి, ఉప సర్పంచ్ సుతారి నరేశ్ పాల్గొన్నారు.

కంటి వెలుగులో ఉచితంగా పరీక్షలు



దోమకొండ : ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న కంటి వెలుగు పథకాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకోవాలని డీఎంహెచ్‌వో లక్ష్మణ్‌సింగ్ అన్నారు. మంగళవారం మండలంలోని అంచనూరులో కంటి వెలుగు కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. కంటికి సంబంధించిన వివిధ పరీక్షలను ఉచితంగా చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ తీగల తిర్మల్‌గౌడ్, ఎంపీపీ కానుగంటి శారద, సర్పంచ్ బురాని సమత, ఎంపీటీసీ సభ్యురాలు దొర్నాల లక్ష్మి, సొసైటీ చైర్మన్ నాగరాజ్‌రెడ్డి, ఉపసర్పంచ్ నరేష్, తదితరులు ఉన్నారు.

26న నూతన కలెక్టరేట్‌లో రిపబ్లిక్ డే వేడుకలు

సుభాష్‌నగర్ : గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని 26న సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం ఆవరణలో రిపబ్లిక్ డే ఉత్సవాలు నిర్వహిస్తామని కలెక్టర్ నారాయణరెడ్డి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం ఉదయం 10.00 గంటలకు జాతీయ పతాకావిష్కరణ ఉంటుందన్నారు. అన్ని శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది ఉదయం 9.30 గంటల వరకు కొత్త కలెక్టరేట్‌కు చేరుకోవాలన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

కోటగిరి : కోటగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో హంగర్గా బీసీ కాలనీలోని హన్మాన్ మందిరం సమీపంలో సోమవారం రాత్రివేళ పంట పొలాల మధ్య పేకాటాడుతున్న ఆరుగురు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు ఎస్సై మచ్చేందర్‌రెడ్డి మంగళవారం వెల్లడించారు. రూ. 5,540 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

పీడీఎస్ బియ్యం పట్టివేత

కామారెడ్డి క్రైం : పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా తరలించేందుకు వాహనంలో నింపుతుండగా విశ్వసనీయ సమాచారం మేరకు పట్టణ పోలీసులు మంగళవారం దాడి చేసి పట్టుకున్నారు. కామారెడ్డి సిరిసిల్ల రోడ్‌లో ఉన్న ఎల్లమ్మ గుడి ఎదురుగా ఓ రేకుల షెడ్డులో పీడీఎస్ బియ్యాన్ని అక్రమంగా నిల్వ ఉంచారు. 58 బస్తాల్లో నింపిన 36.20 క్వింటాళ్ల బియ్యాన్ని బొలెరో వాహనంలో మరో చోటకు తరలించేందుకు నింపుతుండగా బియ్యంతో పాటు వాహనాన్ని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ వ్యవహారంలో బాధ్యుడైన బ్రాహ్మణపల్లి రమణ అనే వ్యక్తిపై కేసు నమోదు చేసి సివిల్ సప్లయ్ అధికారులకు అప్పగించనున్నట్లు ఎస్‌హెచ్‌వో నరేశ్ తెలిపారు.

క్రైం కార్నర్

ప్రాణం తీసిన ఆస్తి తగాదా

- భర్తను హత్య చేసిన భార్య


మృతుడు వెంకట్‌రెడ్డి

బాన్సువాడ రూరల్ : కుటుంబ తగాదాల మూలంగా ఓ మహిళ తన భర్తను హత్యచేసిన ఘటన బాన్సువాడ మండలం తాడ్కోల్ గ్రామంలో చోటు చేసుకుంది. బాన్సువాడ సీఐ మహేందర్‌రెడ్డి, గ్రామస్థులు తెలిపిన ప్రకారం వివరాలిలా ఉన్నాయి. తాడ్కోల్‌కు చెందిన తుమ్మల వెంకట్‌రెడ్డి(65)కి అతని భార్య రుక్మిణికి గతకొన్ని రోజులుగా మనస్పర్థలు వచ్చి గొడవ పడుతుండేవారు. ఈక్రమంలో ఈనెల 21న ఇరువురి మధ్య ఆస్తి తగాదాకు సంబంధించి వివాదం జరగటంతో వెంకట్‌రెడ్డి తన చెల్లెలు కౌసల్య ఇంటికి వెళ్లి గొడవ జరిగిన విషయాన్ని చెప్పాడు. మధ్యాహ్న భోజనం అనంతరం నిజామాబాద్ వెళ్లి మరుసటిరోజు తిరిగి గ్రామానికి వచ్చాడు. ఈనెల 23న వెంకట్‌రెడ్డి కిరాణషాప్ నుంచి గుడ్లు తీసుకుని ఇంటికి వెళ్లిన తర్వాత మళ్లీ భార్యాభర్తల మధ్య వివాదం చోటుచేసుకుంది. ఈ క్రమంలో వెంకట్‌రెడ్డి భార్య చెవి, తలపై బలమైన ఆయుధంతో కొట్టి నెట్టివేయడంతో వెంకట్‌రెడ్డి అక్కడికక్కడే మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మృతుడి సోదరి బండరాజవ్వ బాన్సువాడ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని పోస్టు మార్టం నిమిత్తం బాన్సువాడ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ మహేందర్‌రెడ్డి తెలిపారు. త్వరలో నిందితులను పట్టుకుంటామన్నారు.

ఆస్పత్రుల్లో చోరీలు

ఖలీల్‌వాడి : నగరంలోని ఒకటవ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పరిధిలోని ఖలీల్‌వాడిలోని ప్రైవేట్ ఆస్పత్రుల్లో చోరీలు ఎక్కువగా జరుగుతున్నా యి. ప్రైవేట్ ఆస్పత్రిలోని పేషెంట్ అటెండర్ల వద్ద ఉన్న సెల్‌ఫోన్లతో పాటు పర్సులు ఎత్తికెళ్లిన ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. గతంలో కూడా ఓ ప్రవేట్ ఆస్పత్రిలో వృద్ధురాలి బంగారు నగలను ఎత్తుకెళ్లారు. ఆస్పత్రిలోని సీసీ ఫుటేజీలో నిందితుల చిత్రాలు రికార్డయ్యాయి. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తెలుస్తోంది. కాని ఇంతవరకు ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

సింగంపల్లిలో..

మోపాల్ : మండలంలోని లింగంపల్లిలో ఎత్తరి చందర్ ఇంట్లో సోమవారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు ఎస్సై మహేష్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం అర్ధరాత్రి గుర్తుతెలియని ఇద్దరు వ్యక్తులు చందర్ ఇంట్లో చొరబడి బీరువాలో ఉన్న రూ. 2,40,000లను ఎత్తుకెళ్లారు. బైక్‌పై ఇద్దరు వచ్చి నగదును దోచుకెళ్లారన్నారు. చందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు.

పరీక్షా కేంద్రాలే టార్గెట్‌గా..

- సెల్‌ఫోన్ల అపహరణ
- అంతర్ జిల్లా ముఠా అరెస్టు
- వివరాలు వెల్లడించిన ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి


నిందితులను చూపుతున్న పోలీసులు

కామారెడ్డి క్రైం : ఉమ్మడి జిల్లా పరిధిలోని పలు ప్రాంతాల్లో పరీక్ష కేంద్రాల వద్ద సెల్‌ఫోన్లను టార్గెట్ చేస్తూ దొంగతనాలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా ముఠాను దేవునిపల్లి పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్పీ శ్రీనివాసరెడ్డి వివరాలు వెల్లడించారు. బోధన్ మండలం బెల్లాల్ గ్రామానికి చెందిన తన్నీరు ప్రభాకర్, అతని అక్క లక్కరాజుల చంద్రకళతో కలిసి తేలికగా డబ్బులు సంపాదించాలనే ఆలోచనతో పరీక్ష కేంద్రాల వద్ద సెల్‌ఫోన్లు చోరీ చేయాలని నిర్ణయించుకున్నారు. ఈనెల 12న కామారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణలో విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా వారి బైకు డిక్కీల్లో సెల్‌ఫోన్‌లను దాచి వెళ్లారు. ఇదే అదనుగా ఓ బైక్ డిక్కీ నుంచి 7 సెల్‌ఫోన్లను చోరీ చేశారు. ఆ తర్వాత ఈనెల 19న ఆర్మూర్‌లోని విజేత డిగ్రీ కళాశాల ఆవరణలో ఓ బ్యాగ్ నుంచి 6 సెల్‌ఫోన్‌లు, 20న నిజామాబాద్ విశ్వశాంతి కళాశాల వద్ద స్కూటీ డిక్కీ నుంచి 5 సెల్ ఫోన్‌ల చొప్పున మొత్తం 18 సెల్‌ఫోన్‌లను దొంగిలించారు. సెల్‌ఫోన్‌ల చోరీపై రాజంపేటకు చెందిన కన్నాపురం నవీన్ అనే వ్యక్తి ఫిర్యాదు చేయడంతో దేవునిపల్లి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. సీసీ కెమెరాలను పరిశీలించి అనుమానితులను గుర్తించారు. రెండు రోజుల క్రితం టేక్రియాల్ బైపాస్ వద్ద పోలీసులు తనిఖీలు చేస్తుండగా బైక్‌పై వెళ్తూ అనుమానాస్పదంగా కనిపించిన ప్రభాకర్, చంద్రకళను అదుపులోకి తీసుకోగా వారు సెల్‌ఫోన్ల చోరీకి పాల్పడినట్లు నేరం అంగీకరించడంతో 18 సెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకున్నారు. కేసు చేదనలో చాకచక్యంగా వ్యవహరించిన దేవునిపల్లి ఎస్సైలు ప్రసాద్, బాల్‌రెడ్డి, సిబ్బంది రవీంద్ర కు మార్, రా జు, పరంధాములు, రవి, కిరణ్, రామ స్వామిలను ఎస్పీ అభినందించారు. అడిషనల్ ఎస్పీ అన్యోన్య, డీఎస్పీ సోమనాదం, రూరల్ సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో మహిళ మృతి


బిజుబాయి(ఫైల్)

వర్ని : వర్ని పోలీస్‌స్టేషన్ పరిధిలోని చందూర్ మండలం మేడిపల్లి తండాకు చెందిన బిజుబాయి (51) లక్ష్మీ సాగర్ ప్రాజెక్ట్‌లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందినట్లు స్థానికులు వెల్లడించారు. మృతి చెందిన మహిళ ఈనెల 15న ఇంటి నుంచి వెళ్లిపోయిందని, కుటుంబ సభ్యులు బంధువులు ఇళ్లల్లో వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో 19న వర్ని పీఎస్‌లో ఫిర్యాదు చేసినట్లు వర్ని ఎస్సై అనిల్ రెడ్డి వెల్లడించారు. మంగళవారం ఉదయం లక్ష్మీ సాగర్ ప్రాజెక్ట్‌లో మృతదేహాన్ని స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి విచారించగా బిజుబాయిగా గుర్తించినట్లు ఎస్సై పేర్కొన్నారు. మృతురాలి భర్త గోవింద్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. బిజుబాయి మృతిపై అనుమానం ఉన్నట్లు స్థానికులు బోధన్ ఏసీపీకి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

పిట్లం మండలంలో..

పిట్లం(జుక్కల్) : మండల కేంద్రంలోని పిట్లం కల్లు డిపో వెనక సోమవారం రాత్రి పిట్లం గ్రామానికి చెందిన మాసంపల్లి లక్ష్మణ్ మద్యం సేవించి మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలానికి వెళ్లి మృతుడి వివరాలు సేకరించారు. ఏఎస్సై లింబ్రాది మాట్లాడుతూ కల్లు డిపో వెనకాల మాసంపల్లి లక్ష్మణ్ (38) మద్యం సేవించి మృతి చెందినట్లు ఆయన తెలిపారు. మాసంపల్లి లక్ష్మణ్ భార్య లక్ష్మి తన భర్త మరణంపై అనుమానం ఉందని ఫిర్యాదు చేర్యాదు చేశారన్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో యువరైతు..


నర్సింగ్ రావ్ మృతదేహం వద్ద కుటుంబీకులు

పిట్లం(జుక్కల్) : మండలంలోని చిన్నకొడప్‌గల్ గ్రామానికి చెందిన యువరైతు నర్సింగ్ రావ్ (28) వ్యవసాయ పొలం వద్ద విద్యుత్‌షాక్‌తో మృతి చెందాడు. కుటుంబ సభ్యులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నర్సింగ్ రావ్ మంగళవారం వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లగా పొలంలో విద్యుత్‌షాక్ తగిలి అక్కడిక్కడే మృతి చెందాడు. నర్సింగ్‌రావ్‌కు మూడునెలల కుమారుడు ఉన్నాడు. పంట పొలంలో ఉన్న నర్సింగ్‌రావ్ మృతదేహం వద్ద అతని కుటుంబ సభ్యుల రోదన అక్కడ ఉన్నవాళ్లందరినీ కలిచివేసింది. యువరైతు మృతితో చిన్నకొడప్‌గల్ గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.